ఈనాడు
విశాఖపట్నం
సిటీ శనివారం 21 జనవరి 2017 16 పేజీలు




# సమారంభ్‌లో..

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

అలరించనున్న రాక్‌బ్యాండ్

ఐఐఎం విశాఖి ఆధ్వర్యంలో నేడు సాంస్కృతోత్సవం

# సందడి చేద్దాం...!

మేనేజ్‌మెంట్ విద్యార్థుల్లో కళలను ప్రోత్సహించేందుకు, సృజనాత్మకత వెలికి తీసేందుకు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు, ఇతర విద్యార్థులతో సమావేశమై ఆలోచనలు, ఆశయాలను పరస్పరం పంచుకునేందుకు సమారంభ్-2017 వేదిక కానుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విశాఖపట్నానికి చెందిన వాత్సల్య బృందం ఆధ్వర్యంలో సమారంభ్-17 శనివారం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విశాఖపట్నం ఐఐఎం ఆధ్వర్యంలో ఈ తరహా సాంస్కృతోత్సవం జరగడం ఇదే మొదటిసారి. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న బిజినెస్ స్కూల్స్, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పలు ప్రదర్శనలు ఇవ్వనున్నారు.


కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఐ.ఐ.ఎం. సాంస్కృతిక విభాగ బృందం

విద్యార్థులకు కళలపై ఆసక్తి పెంచేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐ.ఐ.ఎం) ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి ప్రత్యేక వెబ్ సైట్‌ను www.samaarabh17.com రూపొందించారు. ఇందులో కార్యక్రమాల వివరాలను పొందు పరిచారు. ఆన్‌లైన్ ద్వారా పాల్గొనే విద్యార్థుల తమ పేర్లను నమోదు చేసుకునే సౌలభ్యం కల్పించారు. విద్యార్థులు కాసేపు చదువులను పక్కన పెట్టి వివిధ కళల్లో తమకున్న ప్రతిభను బయట పెట్టేందుకు వీలుగా ఈ వేడుకలో మూడు ప్రధాన కార్యక్రమాలను పొందుపరిచారు. స్పాట్‌లైట్, రాగా, టిప్ టోస్ పేరిట విద్యార్థులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఆటలు, పాటలు, నృత్యాలు.... తదితర వినోద కార్యక్రమాలతో ఏయూ ప్రాంగణం హోరెత్తనుంది. ఇందుకు అవసరమైన వేదికను ఏయూ బాస్కెట్‌బాల్ స్టేడియంలో సిద్ధం చేశారు. దేశ వ్యాప్తంగా మొత్తం 20 కళాశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందని సాంస్కృతిక విభాగం కార్యదర్శి సాయి ఆదిత్య తెలిపారు. ఈ మూడు విభాగాల్లో గెలుపొందిన ప్రథమ విజేతలకు రూ.7 వేలు, ద్వితీయ విజేతలకు రూ.4 వేల చొప్పున నగదు పురస్కారాలను అందజేయనున్నారు.

**స్పాట్‌లైట్ :** నటనలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు స్పాట్‌లైట్ పేరిట స్టేజ్ ప్లే పోటీలను నిర్వహించనున్నారు. ఈ విభాగంలో ప్రదర్శనలు ఇచ్చే విద్యార్థులు సందేశాత్మక, వినోదాత్మక, ఇతర సామాజిక అంశాలను ప్రతిబింబించే నాటికలను ప్రదర్శించవచ్చు.

## అలరించనున్న రాక్‌బ్యాండ్

విద్యార్థులు ప్రదర్శించే వివిధ ప్రదర్శనలతో పాటు విద్యార్థులను ఉత్సాహపరిచేందుకు ఏర్పాటు చేసిన 'రాక్‌బ్యాండ్' ప్రత్యేక ఆకర్షణ కానుంది. కోల్‌కత్తాకు చెందిన 'అండర్ గ్రౌండ్ అథారిటీ' రాక్ బ్యాండ్ బృందం ఇచ్చే ప్రదర్శనలు సమారంభ్‌లో ఆఖరి అంశంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ బృందానికి ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న ఐఐఎంలు నిర్వహించిన సాంస్కృతోత్సవాల్లో ప్రదర్శనలు ఇచ్చిన అనుభవం ఉంది. వారు సుమారు 90 నిమిషాల పాటు ప్రదర్శన ఇస్తారు.

**టిప్‌టోస్ :** నాట్య కళల్లో తమకున్న అనుభవంతో విద్యార్థులను అలరించేందుకు వీలుగా టిప్‌టోస్ పేరిట బృంద నృత్య పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో జానపద, శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాలను ప్రదర్శించవచ్చు.


సాంస్కృతిక ప్రదర్శనలిస్తూ..


ఐ.ఐ.ఎం. విశాఖపట్నం

**రాగా:** విద్యార్థుల్లోని గాయకులను ప్రోత్సహించేందుకు రాగా పేరిట బృందగాన పోటీలను నిర్వహిస్తున్నారు. శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య... ఇలా ఆంగ్లం, ఇతర ప్రాంతీయ భాషల్లో పాటలు పాడవచ్చు. ఒక్కో కళాశాల నుంచి ఇద్దరు గాయకులు పాల్గొనే అవకాశం ఉంటుంది.

## హాస్యానికి ప్రాధాన్యం

ఐఐఎం పూర్వవిద్యార్థి వి. శ్రీధర్ తనదైన శైలి హాస్యంతో ఈ వేడుకలో నవ్వులు పూయించనున్నారు. ఐఐఎం కామిక్ అని పేరొందిన శ్రీధర్ స్టాండ్ అప్ కామెడీ పేరిట ఓ సన్నివేశాన్ని, సందర్భానుసారంగా హాస్యచతురితతో అలరించనున్నారు. వీటితో పాటు 'ఒన్ మినిట్ గేమ్స్' (ఒక్క నిమిషం నిడివి ఉండే ఆటలు) కూడా ఉంటాయి.


పోటీలో ఛాయా చిత్రం

## ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానం...

ఈ సమారంభ్-17లో శనివారం నిర్వహించే కార్యక్రమాలతో పాటు ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్‌ల పోటీలను కూడా నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారిని ఆన్‌లైన్ ఆహ్వానించారు. ఫొటోగ్రఫీ విభాగంలో సుమారు 20 కళాశాలల నుంచి విద్యార్థులు తాము తీసిన ఛాయాచిత్రాలను పోటీలకు పంపించారు. లఘుచిత్రాల పోటీల్లో 5 గురు విద్యార్థులు పోటీలో నిలిచారు. ఈ ఛాయాచిత్రాలను, లఘుచిత్రాలను ఫేస్‌బుక్ ప్రసార మాధ్యమంలో పొందుపరిచారు. ఎవరికి ఎక్కువ లైక్స్ వస్తాయో... వారికి బహుమతి అందిస్తామని సాంస్కృతిక విభాగం కార్యదర్శి ఆదిత్య వెల్లడించారు.



శ్రీధర్